విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



అల్వాల్: కళాశాల స్థాయినుండే విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని విశ్రాంత ఐఏఎస్, లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ అన్నారు. అల్వాల్‌లోని లయోల కళాశాల 45వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ విద్యార్థులు కళాశాల స్థాయిలోనే దేశ సమగ్రతను కాపాడేలా సామాజిక భాద్యతలను చేపట్టాలన్నారు. ఇందుకు బోధన సిబ్బంది సైతం వారికి చేయూతను అందించాలన్నారు. కేవలం విద్యకే పరిమితం కాకుడదన్నారు. ప్రపంచంలో భారతదేశ గౌరవాన్ని పెంపొందించేలా కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు, జ్ఞాపకాలను అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జోఎల్ డేవిడ్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్. జోజిరెడ్డి పాల్గొన్నారు.

కనుల పండువలా..

- వేడుకగా కీసరగుట్ట బ్రహ్మోత్సవాలు
- రెండోరోజు యజ్ఞాలు, వేద పారాయణం



కీసర: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు(గురువారం) కీసరగుట్ట దేవాలయంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలు జరిగాయి. వైదిక కార్యక్రమాల సంధానకర్త పుల్లేటికుర్తి గణపతిశర్మ ఆధ్వర్యంలో టీటీడీ వేదపాఠశాల విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు యజ్ఞాలతో పాటు వేద పారాయణం గావించారు. రుద్రస్వాహాకార హోమం, ప్రదోషకాల పూజ, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు కొనసాగించారు. గర్భాలయంలో కొలువైన స్వామివారికి ఉదయం మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, సాయంత్రం బిల్వార్చన నిర్వహించారు. కల్యాణోత్సవం కోసం గురువారం రాత్రి స్వామివారిని గుట్టకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. నేడు(శుక్రవారం) మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామివారి దర్శనార్థం యాత్రికులు పెద్ద ఎత్తున గుట్టకు చేరుకుంటున్నారు.

కళకళలాడిన పోచమ్మ అంగడి

ఏటా కీసరలో మహాశివరాత్రి ముందురోజు జరిగే పోచమ్మ అంగడి గురువారం ఉత్సాహంగా జరిగింది. కాప్రా, యాప్రాల్‌తో పాటు నగరం నలుమూలల నుంచి ముఖ్యంగా తమిళులు ఇక్కడకు చేరుకొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు తమ సాంప్రదాయాన్ని పాటిస్తూ ఎండ్లబండ్లపై కీసరకు చేరుకోవడం విశేషం. బ్రహోత్సవాల సందర్భంగా గుట్టలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



వేదపారయణం చేస్తున్న వేద విద్యార్థులు



రుద్రస్వాహకార హోమం

నేడు ప్రత్యేక పూజలు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నేడు(శుక్రవారం) దేవాలయంలో ఉదయం 4 గంటలకు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, ఉదయం 6 గంటల నుంచి సామూహిక అభిషేకాలు, 9 గంటలకు రుద్రస్వాహాకార హోమం, రాత్రి 8 గంటలకు నందివాహన సేవ, 10 గంటలకు భజనలు, 12 గంటలకు రామలింగేశ్వర స్వామివారికి సంతత ధారాభిషేకం(లింగోద్భవ కాలంలో) ఉంటుంది.

జ్యోతిర్లింగాల దర్శనంతో మనశ్శాంతి



ఆధ్యాత్మిక ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, సునీత దీది

ఉప్పల్: మహా శివరాత్రి మహోత్సవాన్ని పురస్కరించుకుని బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఉప్పల్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసి మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన శ్రీ రామేశ్వర జ్యోతిర్లింగ మహాదర్శనం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను, ఆధ్యాత్మిక ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రామేశ్వర జ్యోతిర్లింగాల దర్శనం చేయించడం అభినందనీయమన్నారు. మహాశివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బ్రహ్మకుమారీస్ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఎంతో ఉత్సహాన్ని ఇవ్వడంతో పాటు మానసిక ప్రశాంతతను అందిస్తుందని అన్నారు.

ప్రజలకు ఆహ్లాదం పంచేలా పార్కుల అభివృద్ధి

బోడుప్పల్: ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే విధంగా పార్కును అభివృద్ధి చేసినట్లు బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. లక్ష్మినగర్(హుడా) పార్కును హెచ్ఎండిఎ నిధులు రూ 40లక్షల వ్యయంతో అభివృద్ధి చేయగా గురువారం ఆయన ప్రారంభించారు. రానున్న వేసవి కాలంలో స్థానిక ప్రజలకు ఆనందాన్ని, ఆహ్లాదాన్ని అందించే విధంగా అభివృద్ధి చేసినట్లు వెల్లడించారు. కార్య క్రమంలో కమిషనర్ రామలింగం, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మిరవిగౌడ్ పాల్గొన్నారు.

జన్మ సార్థకతకు జ్యోతిర్లింగాల దర్శనం మార్గం



ద్వాదశ జ్యోతిర్లింగ దర్శన కార్యక్రమంలో మేయర్ జక్కా వెంకట్ రెడ్డి

మేడిపల్లి: జీవ జన్మసార్థకతకు,పాప విమోచనం కావడానికి జ్యోతిర్లింగాల దర్శించుకోవడం ద్వారా విమోచన మార్గం చూపుతుందని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి అన్నారు. మహా శివరాత్రిని పురస్కరించుకొని బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయ ఆధ్వర్యంలో గురువారం మేడిపల్లి శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో ద్వాదశ జ్యోతిర్లింగ దర్శన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ...పరమ శివుడి దర్శనం, ధ్యానం మహా శివ రాత్రి పర్వ దినంలో ఆచరిస్తే పాపాలు పటాపంచలయి పోతాయన్నారు.

విద్యలో విప్లవాత్మకమైన మార్పుల కోసం ఒప్పందం



వెక్సెల్ సంస్థ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మల్కా కొమరయ్య, వెక్సెల్ సీఈఓ నవీన్‌కుమార్

మల్లాపూర్: విద్యలో విప్లవాత్మకమైన మార్పు కోసం పల్లవి గ్రూప్ స్కూల్స్ వెక్సెల్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నామని ఢిల్లీ పబ్లిక్ స్కూల్స్ ఛైర్మన్ మల్కా కొమరయ్య అన్నారు. పల్లవి గ్రూప్ ఆఫ్ స్కూల్స్, వెక్సెల్ మధ్య లెర్నింగ్‌పై నాచారం డీపీఎస్‌లో, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ గ్రూప్ ఛైర్మన్ మల్కాకొమరయ్య, వెక్సెల్ సీఈఓ నవీన్‌కుమార్, సీఓఓ కిరణ్ ఆత్మకూరు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. అనంతరం మల్కా కొమరయ్య మట్లాడుతూ ముఖ్యంగా విద్యలో టీచర్ల పనిభారం తగ్గించి, విద్యార్థులకు అభ్యాసనం మెరుగుదలపై ఎంతగానో ఉపయోగపడేలా కృషి చేయాడానికి ముందుకు వచ్చిన వెక్సెల్ సంస్థకు అభినందనలు తెలిపారు.

యూజీడీ సమస్యలు పరిష్కరించాలి

రామంతాపూర్ : డివిజన్ పరిధిలో నెలకొన్న భూగర్భ డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు జలమండలి జనరల్‌మేనేజర్ సంతోష్ కుమార్‌ని కలిసి వినతిపత్రం సమర్పించారు. గత కొన్ని సంవత్సరాలుగా డివిజన్ పరిధిలో సరఫరా చేసే పైప్‌లైన్‌లు శిథిలావస్థలోకి చేరి తాగునీరు కలుషితంగా వస్తున్నాయని వాటిని తొలగించి వెంటనే కొత్త పైప్‌లైన్ పనులు ప్రారంభించాలని ఆమె వినతిపత్రంలో కోరారు. జల మండలి జీఎంను కలిసిన వారిలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు బండారు వెంకటరావు తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన కార్పొరేటర్

మల్లాపూర్: ఓల్డ్ మల్లాపూర్‌లోని కౌండిన్య భవన్ మొదటి అంతస్తులో రూ.15.50 లక్షల వ్యయంతో జరుగుతున్న ఫ్లోరింగ్ పనులను మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌డ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. పనుల్లో వేగం పెంచి పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మల్లాపూర్ ఏఈ స్రవంతి, వర్క్‌ఇన్ స్పెక్టర్ బిక్షపతి, స్థానిక నేతలు వాసుగౌడ్, బాలరాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరసన తెలిపితే కేసులు పెడుతారా

అల్వాల్ ఉపకమిషర్ తీరుపై విమర్శలు



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లు సీనియర్ నాయకులు

అల్వాల్: సర్కిల్ కార్యాలయం ప్రజా ప్రతినిధులు నిరసన తెలిపితే కేసులు పెట్టడం సరికాదని బీఆర్ఎస్ కార్పొరేటర్‌లు, సీనియర్ నాయకులు అన్నారు. బుధవారం అల్వాల్ సర్కిల్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన ఎల్ఆర్ఎస్ రుసుము వసూళ్లపై నిరసన కార్యక్రమంలో జరిగిన సంఘటనలో అల్వాల్ సర్కిల్ ఉపకమీషనర్ డి. శ్రీనివాస్‌రెడ్డి మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మరో ఇద్దరు బీఆర్ఎస్ నేతలపై అల్వాల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయ్యగా కేసు నమోదు అయింది. దీంతో కేసు నమోదు పట్ల నిరసన వ్యక్తం చేస్తు గురువారం అల్వాల్ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి నివాసంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. కార్పొరేటర్లు సబిత అనీల్ కిషోర్, శాంతి శ్రీనివాస్‌రెడ్డిలు, సీనియర్ నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విదానాల పట్ల నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి ఉంటుందన్నారు. బుధవారం సర్కిల్ కార్యాలయం వద్ద జరిగిన సంఘటనలో ఉపకమీషనర్ వ్యవహరించిన తీరును ఖండించారు. అనంతరం అల్వాల్ పోలీస్ స్టేషన్‌లో ఉపకమీషనర్‌పై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు.

సమాజాభివృద్ధిలో మహిళలది కీలక పాత్ర

రామంతాపూర్ : ప్రతిభ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన మహిళా దినోత్సవం కార్యక్రమానికి కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు హాజరై మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుసంపన్నమైన సమాజాభివృద్ధిలో మహిళలు ఒక్క తల్లిగా భార్యగా చెల్లిగా కీలక పాత్ర వస్తారని ఆధునిక భారతదేశంలో మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. మహిళా ఉపాధ్యాయురాలు ప్రియాంక సులోచన, శాలిని, స్వప్న, ప్రసన్న, సుహాసిని, దివ్య, ప్రశాంతి, ముషిత తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు గృహజ్యోతి పథకం అందించాలి

గౌతంనగర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందచేస్తున్న గృహజ్యోతి పథకం అర్హులైన పేదలందరికి అందచేయాలని మల్కాజిగిరి మండల సీపీఐ కార్యదర్శి టి.యాదయ్యగౌడ్ అన్నారు. గురువారం మల్లిఖార్జుననగర్ సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో 200 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగించుకునే నిరుపేదలకు గృహజ్యోతి పథకం అందచేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఏఐటీయూసీ మండల ప్రధాన కార్యదర్శి బి.యాదగిరి, నాయకులు ఎం.లింగం, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

అల్వాల్/గౌతంనగర్: ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం నేరేడ్‌మెట్‌లోని హెలెన్ కెల్లర్స్ కళాశాల, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ హైటెక్ సిటీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెలెన్ కెల్లర్స్ కళాశాల ఆవరణలో పాఠశాల జూనియర్ కాలేజీ, యు.జీ.పి.జి కాలేజ్ మహిళ ఉపాధ్యయులు, ఇతర మహిళా సిబ్బందిని పాఠశాల వ్యవస్థాపకులు ఉమర్‌ఖాన్ సతీమణితో, ఉమర్‌ఖాన్‌లు 62 మంది మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

గౌతంనగర్‌లో....

నేటి మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించే దిశగా అడుగులు వేయడం అనందకరమని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా విద్యాధికారిని విజయ కుమారి అన్నారు. గురువారం మల్కాజిగిరిలో పీ.ఆర్.టి.యు.టీఎస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి.

మౌలిక వసతులు కల్పించాలి

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం కార్పొరేటర్ మేకల సునీతరాముయాదవ్ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ తెలపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బైరు అనిల్, సిద్ధి రాములు, నర్సింగ్, బిక్షపతి, నరహరిరావు పాల్గొన్నారు.

మహిళలతోనే సమాజాభివృద్ధి

మల్లాపూర్: మహిళలతోనే కుటుంబాలు తద్వారా సమాజ అభివృద్ధి జరుగుతుందని సాధన మానసిక దివ్యాంగురాల సంస్థ డైరెక్టర్ పి.సురేఖారెడ్డి అన్నారు.గురువారం మల్లాపూర్ సెయింట్ ఆన్స్ పీజీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సం కార్యక్రమాని నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా పి.సురేఖా రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా గతంలో మహిళలు కేవలం ఇంటికే పరిమితమయ్యేవారని గుర్తు చేశారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అన్ని రంగాల్లో పురుషులకు ధీటుగా రాణిస్తున్నారని తెలిపారు.

వైభవంగా కల్యాణోత్సవం

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్ రవీంద్రనగర్ కాలనీలోని శ్రీకోదండ రామాలయ కల్యాణ మహోత్సవం గురువారం భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ బేతి స్వప్నరెడ్డిలు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బద్దం భాస్కర్‌రెడ్డి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భ్రమరాంబిక మల్లికార్జున స్వామి కల్యాణం

రామంతాపూర్ : ఓల్డ్ రామంతాపూర్‌లోని పురాతన శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయంలో శివ రాత్రి పర్వదిన ఉత్సవాల్లో భాగంగా గురువారం శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, బండారు శ్రీవాణి వెంకట్‌రావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఎండోమెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వెల్లంకి నరేందర్, ప్రధానార్చకులు మోత్కూరి శేఖర్‌బాబు శర్మ, ఆలయ మాజీ చైర్మన్ దయాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా కృషి చేసి బీజేపీని గెలిపించండి

అల్వాల్: రానున్న ఎన్నికలలో భారతీయ జనతా పార్టీని గెలిపించాలని బీజేపీ నాయకులు ఈటల రాజేందర్ అన్నారు. అల్వాల్‌లోని బీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన పార్టీ కార్యాక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో మరోమారు నరేంద్ర మోడీ ప్రధాన మంత్రి కావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఇందుకు భారతీయ జనతాపార్టీ అత్యధిక సీట్లు గెలవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సునీత యాదవ్ పాల్గొన్నారు.